జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 20 మే 2024 www.ntnews.com
13

వైకుంఠంలో శ్రీహరి శాంతాకారం భుజగ శయనం పద్మనాభం సురేశం.. ఆ ప్రశాంత వదనుడు.. స్తంభ సంభవుడిగా ఆవిర్భ వించగానే ప్రళయమూర్తిగా దర్శనమిచ్చాడు. జూలు విదిల్చాడు. ప్రళయ గర్జన చేశాడు. వచ్చీరాగానే అసుర భంజనం గావించాడు. శ్రీమహావిష్ణువు నరకేసరిగా విచిత్రాకృతి పూనిన వైనం అద్భుతం. అదే మృగేంద్రలీల. తలచుకునే కొద్దీ మనసంతా పులకితమయ్యే నృసింహలీల పరమోన్నతం.

# ఉగ్రం.. వీరం.. శాంతం



బుధవారం నృసింహ జయంతి

'గోవిందం ఆదిపురుషం తం అహం భజామి' అంటూ దేవాదిదేవుడైన గోవిందుడిని కొనియాడింది బ్రహ్మ సంహిత. ఆదిపురుషుడంటే దేవాదిదేవుడైన మహావిష్ణువు. నరమృగ శరీరుడై మృగేంద్రలీలను గావించినది ఆయనే! మృగాలలో రాజు సింహం! అందుకే ఈ నరసింహ ఆవిర్భావం, ఆయన గావించిన అసుర సంహార ఘట్టం మృగేంద్రలీలగా ప్రాశస్త్యం పొందింది. వేల సంవత్సరాలు కఠోర తపస్సు చేసే మునులకు కూడా అంత తేలిగ్గా ప్రసన్నం కాని ఆ పరంధాముడు ఐదేండ్ల పసి ప్రహ్లాదుడు తలచిన వెంటనే తరలివచ్చాడు. కాగల కార్యం అన్నీ తానే అయి చేశాడు. అధర్మాన్ని 'చీల్చి'చెండాడాడు. ధర్మాన్ని నిలబెట్టాడు.

సత్యయుగంలో చోటు చేసుకున్న నృసింహ లీలలోని అంతర్గత సంఘటనలు నేటికీ మరోవిధంగా మనమంతా అనుభూతి చెందుతున్నవే! అవును! అత్యంత కఠోర తపస్సు ఆచరించి శక్తియుక్తులను పొంది తానే సర్వేశ్వరుడనని, తనను మించిన దైవం మరొకటి లేదని భావించాడు హిరణ్యకశిపుడు. 'ఎక్కడిది రా నీకీ శక్తి?' అని కొడుకును ఉరిమాడు. 'ఏది నీ శక్తికి ఆధారమో, ఆ స్వామే నా శక్తికీమూలం తండ్రీ!' అని బదులిచ్చాడు ప్రహ్లాదుడు. భగవంతుడు ఏర్పరచిన ప్రకృతి నియమానుసారం పూర్వ సుకృతి కారణంగా తగిన ఉన్నత స్థానాన్ని పొందిన జీవుడు, ఆ కారణాన్ని మరచి, తానే సమస్తానికి కర్తనని తలచినపుడు అహంభావానికి లోనవుతుంటాడు. ఈ సృష్టిని నియంత్రించే శక్తి మరొకటి ఏదీ లేదని, ఇదంతా కేవలం స్త్రీ-పురుషుల మైథునం కారణంగానే ఏర్పడిందని తలచడం అసుర లక్షణాల్లో ఒకటి. ప్రకృతి పలు విధాలా ఇటువంటి భావనల నుంచి కనువిప్పు కలిగించే ప్రయత్నం చేసినా, వాటిని గ్రహించలేని జీవుడు తగిన ప్రతిఫలాన్ని పొందక తప్పదు. అలా హిరణ్యకశిపుడు ఎల్లప్పుడూ తనను తాను పరమేశ్వరుడనని చెప్పుకొన్నప్పటికీ, ప్రహ్లాదుడికి మాత్రం నిజమైన పరమేశ్వరుడు, సర్వకారణ కారణుడు ఆ శ్రీహరేనన్న సత్యం తెలుసు. ఇదే పరమసత్యమని భగద్గీత ఉవాచ.

**యస్మాత్ క్షరమతీతోఽహమక్షరాదపి చోత్తమః**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః**
**(భగవద్గీత 15.18)**

'నేను నశ్వరమైన ఈ భౌతిక పదార్థానికీ, నాశరహితమైన జీవాత్మకూ అతీతమైనవాడను. కాబట్టి వేదాల్లో, స్మృతుల్లో నేనే సర్వోత్కృష్ట దివ్య పురుషుడిగా వెలుగొందాను'
ప్రహ్లాదుని మాటలకు మరింత ఆగ్రహించిన హిరణ్యకశిపుడు 'ప్రహ్లాదా! నీవు నిరంతరం ఎవనినో నన్ను మించిన ఉత్తముడని, సమస్త సృష్టికీ అతీతుడని, చరాచర జీవులను నియంత్రిస్తాడని, సర్వాంతర్యామి అని వర్ణిస్తుంటావు. ఎవడు వాడు? ఎక్కడున్నాడు?' అని ప్రశ్నించాడు. 'నా స్వామి ఎక్కడ లేడు తండ్రీ! అంతటా ఉన్నాడు' అని ప్రసన్నవదనంతో సమాధానమిచ్చాడు ప్రహ్లాదుడు. 'అండాంతరస్థం పరమాణు చయాంతరస్థం- సమస్త బ్రహ్మాండాలు అతనిలోనే ఉన్నాయి. బ్రహ్మాండంలోని అణువణువూ ఉన్న సర్వాంతర్యామి ఆ పరమాత్మ' అని బ్రహ్మసంహిత తెలియజేస్తున్నది. కొడుకు సమాధానం విని కోపంతో ఊగిపోయిన హిరణ్యకశిపుడు 'అంతటా ఉన్నట్లయితే.. ఈ స్తంభంలో ఉన్నాడా?' అని ప్రశ్నించాడు. 'నిస్సందేహంగా' అన్నాడు ప్రహ్లాదుడు. ఆ జవాబు విని ఒక్క పిడికిలితో స్తంభాన్ని ముక్కలు చేశాడు అసురుడు. అంతలో స్తంభ జుడై, సర్వాద్భుతమైన నరమృగ శరీరంతో నరసింహుడు అవతరించాడు. మరు క్షణంలో లోకకంటకుడైన హిరణ్యకశిపుడిని వధించాడు. నరసింహుని దివ్య ఆవిర్భావాన్ని భాగవతం 'తన సేవకుడైన ప్రహ్లాదుడి మాటను వాస్తవమని నిరూపించడానికి శ్రీహరి కనీవినీ ఎరుగని అద్భుత రూపంతో అవతరించాడు' అని తెలిపింది.

> "శ్రీకృష్ణుడు బృందావనంలో నందుని ఇంట అవతరించినపుడు కంసుడు పలు రాక్షసులతో దాడి చేయించాడు. ఆ అసుర శక్తులనుంచి తన పుత్రుడిని రక్షించుకునే మార్గం చూపమని నంద మహారాజు గర్గ మునిని వేడుకున్నాడు. అప్పుడు ఆయన నరసింహస్వామిని ఆరాధించమని చెప్పాడు. ఆ విధంగా నంద యశోదలు సైతం తమ పుత్రుని సంరక్షణార్థం నరసింహస్వామిని ఆరాధించడం విశేషం!"



రాధాకృష్ణుల పాదారవిందాలను ఆశ్రయించి సేవించడమే జీవిత పరమ లక్ష్యమైన గౌడీయ వైష్ణవులు శ్రీకృష్ణుడి అనంతమైన అవతారాలలో ఒకటైన నరసింహ స్వరూపాన్ని ప్రత్యేకంగా ఆరాధిస్తుంటారు. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు కృష్ణ మందిరాల్లో స్వామివారి ఆరాధన విధిగా ఏర్పర్చడంలో కారణాన్ని ఇలా వివరించారు. 'నిత్యం శ్రీహరి గుణగణ వైభవాన్నే కీర్తించిన ప్రహ్లాదుడికి హిరణ్యకశిపుడు అనేక విఘ్నాలను కలిగించాడు. హరేకృష్ణ ఉద్యమం లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న సంకీర్తన యజ్ఞం. అయితే, లోకంలో అధర్మాన్ని ప్రోత్సహించే శక్తులూ ఉన్నాయి. ఇవి భగవంతుడు ఏర్పరచిన ధార్మిక నియమాలను ఉల్లంఘించటమే గాక ధార్మిక మార్గాన్ని ఆచరిస్తున్న వారికీ అనేక విఘ్నాలను కలిగిస్తాయి. భగవంతుడు అనుగ్రహించిన వనరులను స్వార్థప్రయోజనాల కోసం కొల్లగొడతాయి. ఎలాగైతే హిరణ్యకశిపుని హింసాత్మక ధోరణి నుంచి నరసింహుడు తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించాడో, అదే విధంగా ప్రహ్లాదుడు చూపిన మార్గాన్ని అనుసరిస్తున్న ఈ హరేకృష్ణ ఉద్యమాన్ని సైతం దుష్టశక్తుల నుంచి సదా రక్షింపమని వేడుకోవటమే నరసింహుడిని ఆరాధించడంలోని మూల విశేషం' అని పేర్కొన్నారు. శ్రీల ప్రభుపాదుల వారు హరేకృష్ణ ఉద్యమాన్ని ప్రపంచమంతా విస్తరిస్తున్న సమయంలో పలు ఆరోగ్య కారణాల రీత్యా వారు చేపట్టవలసిన రచనలకు అంతరాయం ఏర్పడింది. అప్పుడు శిష్యులంతా నరసింహస్వామిని ఆరాధించారు.

సమస్త ప్రపంచానికీ మేలుచేసే విధంగా మనమంతా నరసింహ భగవానుడిని సేవించే మార్గాలైన 'శ్రవణం, కీర్తనం'తో ప్రారంభమయ్యే నవవిధ భక్తిమార్గాలను ప్రహ్లాదుడు లోకానికి ఉపదేశించాడు. భగవంతుడిని గురించి విన్నంత మాత్రాన, ఆయన నామం స్మరించినంత మాత్రాన భక్తియుత సేవలను ప్రారంభించగలం. ఈ పద్ధతి మన హృదయాన్ని పరిశుద్ధం గావించడమే గాక సమస్త విశ్వానికీ శుభాన్ని చేకూరుస్తుంది.


**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే**
**హరే రామ హరే రామ రామ రామ హరే హరే**

... శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ
93969 56984

కథాసుధ

## ఉత్తమ యోగి

ఒకనొక మహానగరం విమానాశ్రయం నుంచి విమానం బయల్దేరింది. ఓ ఆధ్యాత్మిక గురువు అందులో ప్రయాణిస్తున్నాడు. ఆయన పక్క సీటులోని వ్యాపారవేత్త ఆ గురువును ఇలా ప్రశ్నించాడు. 'కొంతకాలంగా నేనొక సమస్యతో సతమతమవుతున్నాను. నిద్ర రావడం లేదు, అన్నం సహించడం లేదు. దాన్నుంచి బయటపడాలంటే ఏమి చేయాలి?' అని అడిగాడు. 'ఏదైనా మనకు మించింది కాదు కదా, ఆ సమస్యను పట్టించుకోవద్దు. తక్షణం వదిలేయ్' అని బదులిచ్చాడు గురువు. 'అలా వదిలేస్తే ఎలా? జరగరానిది జరిగితే?' అని ఎదురు ప్రశ్న వేశాడు వ్యాపారి. 'నువ్వెన్ని ప్రయత్నాలు చేసినా జరగాల్సిందే జరుగుతుంది. జరిగినదాన్ని అంగీకరించక తప్పదు. నువ్వు ప్రయత్నించినా, ప్రయత్నించకపోయినా ఏదో ఒకరోజు సమస్య పరిష్కారం అవుతుంది. అంతవరకు మనం ప్రేక్షకపాత్ర వహిస్తే చాలు!' అని సెలవిచ్చాడు గురువు. 'అయితే నన్ను ఏమీ చేయకుండా, ఊరకే ఉండిపొమ్మంటారా?' అని అడిగాడు వ్యాపారి. 'ఊరకే ఉండువాడు ఉత్తమ యోగి అని వినలేదా' అన్నాడు గురువు. కాసేపు మౌనం వహించిన వ్యాపారి 'మరి దానికి పరిష్కారం ఎలా?' అని అడిగాడు. 'కాలం గడిచే కొద్దీ సమస్య చిన్నదవుతుంది. మనం అంతవరకు వేచి చూడాలి!' అని సలహా ఇచ్చాడు గురువు. ఆ సమాధానానికి విస్తుపోయిన వ్యాపారి 'కాలం గడిచే కొద్దీ సమస్య ఎలా చిన్నదవుతుంది?' అని మళ్లీ ప్రశ్నించాడు. 'ఇందాక మనం విమానం ఎక్కిన ఊరు మహానగరమని నమ్ముతావా' అని అడిగాడు గురువు. 'అందులో అనుమానమేముంది? నేను పుట్టినప్పటినుంచీ చూస్తున్నాను. రోజురోజుకూ నగరం పెరుగుతోందే కానీ తగ్గడం లేదు!' ధీమాగా చెప్పాడు వ్యాపారి. 'ఒకసారి విమానం కిటికీలో నుంచి తొంగి చూడు. నగరం ఇప్పుడు ఎలా కనిపిస్తుందో చెప్పు' అన్నాడు. అలాగే తొంగిచూశాడు వ్యాపారి. ఆ మహానగరం చిన్న ఊరులా కనిపించింది వ్యాపారికి. కొద్ది సేపటికి తేరుకొని 'నిజమే! అప్పటికప్పుడే సమస్యని చూస్తే అది ఏనుగులాగా అనిపిస్తుంది. కాసేపు వేచి ఉంటే.. అదే సమస్య చీమంత అవుతుంది' అని తెలుసుకున్నాడు వ్యాపారి.



... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

ఇస్లాం బోధ

## మళ్లీ వర్షకాలం వస్తుంది

'మీరు ప్రతి వర్షకాలంలోనూ చూస్తారు, అల్లాహ్ ఆకాశం నుండి నీళ్లు కురిపించాడు. నిర్జీవంగా పడి ఉన్న భూమిలో దానిద్వారా ప్రాణం పోశాడు. నిశ్చయంగా ఇందులో వినేవారికి ఒక నిదర్శనం ఉన్నది'
**(ఖుర్ఆన్ 16:65)**

'నేల పూర్తిగా ఏమీ లేని చదరపు మైదానంలా ఉంటుంది. అందులో జీవమున్న ఏ సూచనా గోచరించదు. గడ్డి పరకా కానరాదు. తీగలు, రెమ్మలు, ఆకులు, పువ్వులూ కనిపించవు, ఎటువంటి కీటకాలూ కనబడవు. ఇంతలో వర్షకాలం వస్తుంది. తొలకరి వానలకే నేలపైన జీవం ఊటలయి పెల్లుబుకడం మొదలవుతుంది. భూమి పొరల్లో దాగి ఉన్న అనేక వేళ్లు ఎకాఎకీన బతికి నిలబడతాయి. ప్రతిదానికి పచ్చిక మెరుస్తుంది. ఆ పచ్చిక, నిరుడు వానకాలంలోనూ పుట్టి చచ్చిపోయిందే. అసంఖ్యాకమైన కీటకాలు వేసవిలో నామరూపాల్లేకుండా సమసిపోయినవి అకస్మాత్తుగా కిందటి వానకాలంలో మాదిరిగానే తీవిగా బయటపడతాయి. ఇదంతా దైనందిన జీవితంలో మాటిమాటికీ చూస్తూనే ఉంటాం. ఇన్నిన్ని నిదర్శనాలు చూశాక కూడా 'మరణించిన తర్వాత మానవులనందరినీ అల్లాహ్ తిరిగి బతికించి లేపుతాడన్న మాట వింటే మీకు విస్మయం కలుగుతుందేమిటీ?' అని ఖురాన్ ప్రశ్నిస్తుంది.




... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

## వైరాగ్యమే సంపద

**అహంకారసుతం విత్త భ్రాతరం మోహ మన్దిరమ్।**
**ఆశాపత్నీం త్యజే ద్యావత్తావన్ముక్తో న సంశయః॥**
**(మైత్రేయోపనిషత్తు 2-12)**

'ఎప్పుడైతే మనిషి అహంకారమనే కుమారుణ్ని, ధనమనే సోదరుణ్ని, మోహమనే ఇంటిని, ఆశ అనే భార్యను వదలేయగలుగుతాడో అప్పుడే అతడు ముక్తి పొందుతాడు అనడంలో సందేహం లేదు' అని చెబుతుంది మైత్రేయ ఉపనిషత్తు. ముముక్షువైనవాడు పైన చెప్పినవన్నీ వదిలేయగలగాలి. అంటే వాటిపట్ల పూర్తి వైరాగ్యం మనసులో స్థిరపడాలి. అప్పుడే ఆ వ్యక్తికి ముక్తి లభిస్తుంది. ప్రాణాయామ ప్రత్యాహారాది సాధనలన్నీ యోగమార్గం కిందికి వస్తాయి. సంగీత సాహిత్యాది లలిత కళలు రాగమార్గం కిందికి వస్తాయి. రెండిటి లక్ష్యము మోక్షమే అని విస్మరించొద్దు.




ఉపనిషత్ వాక్యం

తులసీదాసు, పోతన మొదలైన కవులు... త్యాగరాజు, అన్నమయ్య లాంటి వాగ్గేయకారులు నిరంతరం పరతత్వాన్ని కీర్తించి తరించిన వారే! సంగీత ప్రపంచంలో ధ్రువతారగా పేరుగాంచిన త్యాగరాజుకు ధనంపై ఉన్న వైరాగ్యాన్ని గురించిన ఒక సంఘటనను పరిశీలిద్దాం. ఉపనిషత్తు పేర్కొన్నట్టు ధనమనే సోదరుని ఏ విధంగా వదిలివేయాలో ఆ మహనీయుని జీవితం ద్వారా తెలుసుకోవచ్చు. అలాంటివారికి వైరాగ్యమే సంపద అవుతుంది. ఒకరోజు త్యాగరాజు తంబుర మీటుతూ, చిరుతలు వాయిస్తూ భక్తి గీతాలు ఆలపిస్తూ భిక్షాటనకు బయలుదేరాడు. ఒక బ్రాహ్మణుడు త్యాగరాజు పాత్రలో బియ్యం కుమ్మరించాడు. అప్పుడు నాణేల శబ్దం వినిపించగా త్యాగయ్య కలవరపడ్డాడు. వాటి స్పర్శ వల్ల బియ్యం మైలపడ్డాయి అని భావించి.. బియ్యాన్ని నడివీధిలో పారబోశాడు. త్యాగయ్యకు ధనం మీద అంత వైరాగ్యం. తంజావూరు ప్రభువైన శరభోజి మహారాజు అతనికి ఎలాగైనా ధనరాశులు సమర్పించాలని ప్రయత్నించాడు. కానీ, ఫలించలేదు. అదీ ఆ 'నాదబ్రహ్మ' వైరాగ్యం. ధనంపై తీవ్ర వైరాగ్యం ఉంటే గాని మోక్షం సిద్ధించదన్న ఉపనిషత్ వాక్యానికి త్యాగయ్య నిలువెత్తు నిదర్శనం.

... డా|| వెలుదండ సత్యనారాయణ

# బృందావనంలో నందబాలుర క్రీడ!



మన పోతన 171 వ భాగం మధురిమ

శుక ఉవాచ- రాజా! ఔత్తరేయా! ఉత్తరుని- బాలకృష్ణ రూప విష్ణుని లోకోత్తర అనుగ్రహం పొందిన నలకూబర మణిగ్రీవులు ప్రదక్షిణ పూర్వకంగా పరమాత్మునికి పదేపదే ప్రణమిల్లి ఉత్తరదిక్కుకు ప్రయాణమయ్యారు. పిమ్మట నందుడు మొదలైన పెద్దలు మద్దులు విరిగిపడ్డ పెద్ద చప్పుడు విని, పిడుగు పడ్డదేమోనని భయపడి వడివడిగా వచ్చి చూశారు. పిడుగుపాటు లేదు, ప్రభంజనం- పెనుగాలి పోటూ లేదు, గొడ్డలి వేటు గుర్తులూ లేవు. పోనీ, ఈ పసివాడే చెట్లను పడదోశాడనటం కూడా పాడి కాదు. ఇంతకీ చెట్లు ఎలా కూలిపోయాయో అంతుచిక్కడం లేదు. ఇది చాలా వింతగానే ఉంది. ఇలా పలువురు పలు విధాలుగా పలుకుతూ ఉండగా, అక్కడే ఆడుకుంటున్న చిన్నపిల్లలు, తాము కనులారా కన్నదాన్ని ఉన్నది ఉన్నట్లుగా వారికి విన్నవించారు. పిల్లలు కల్లలాడుతున్నారని పెద్దలెల్లరూ సంశయించారు. నందుడు మాత్రం తన తనయుడు క్షేమంగా ఉన్నందుకు అమందానంద భరితుడై ఆత్రపడుతూ నందనుని- కుమారుని బంధనాన్ని విప్పేశాడు. అప్పుడు లీలావినోది అయిన కృష్ణుడు ఈ ఘటన నుంచి గోకులవాసుల మనస్సులను మరలించి, మభ్యపెట్టి- మోసపుచ్చడానికి బాలుని వలె నటించసాగాడు. పరమార్థంలో... భగవంతుని బంధించగలది భక్తి మాత్రమే! విడిపించ గలవాడు కూడా భాగవతుడు- భక్తుడు మాత్రమే! యశోద భక్తి, నందుడు భక్తుడు. వేదాంతపరంగా.. 'ఆత్మాత్వం గిరిజామతిః' తల్లి బుద్ధి- ప్రకృతి, బంధనం తగిలించింది. ఎలా? జీవునికి బంధనమనేది స్వతహాగా- స్వరూపంలో లేదు. ఎందుకని? 'జీవో దేవః సనాతనః'- పారమార్థికంగా జీవుడు కూడా దేవుడే కనుక. మరి బంధనమేమిటీ? అది బుద్ధి యొక్క ఆరోపణ (లేనిదాన్ని మోపుట) మాత్రమే! తండ్రి- పురుషుడు, ఆత్మ. అనగా గురువు. (ఈశ్వరో గురురాత్మేతి భేద విభాగినే). ఆయన (నందుడు) బంధనాన్ని అపవదించాడు- తొలగించాడు, తోసిపుచ్చాడు. మరో విశేషం.. ప్రపంచం పరమాత్మ చేతిలో కీలుబొమ్మ. కాని, ప్రస్తుతం ఆ పరబ్రహ్మ బాలకృష్ణుని రూపంలో గోకులవాసుల చేతిలో తోలుబొమ్మ! శ్రీకాంతుడు గోపకాంతల సమక్షంలో, బమ్మెరవారి మాటలో 'జంత్రము కైవడిన్' ఒక యంత్రంలా దిమ్మతిరిగేటట్లు ఆటబొమ్మలా అమాయకంగా ఆడుతున్నాడు, పాడుతున్నాడు...

**శా|| 'పాడున్ మందుని భంగి గోపవనితల్ పాణిధ్వనుల్ సేయఁగా**
**నాడున్ జంత్రము కైవడిం బరవశుండై హస్తముల్ ద్రిప్పుచుం**
**జూడన్నేరని వాని భంగి జనులం జూచున్ నగున్ బాలురం**
**గూడుం బెద్దల పంపు సేయఁ జనుడాగున్ మట్టి జిట్టాడుచున్'**

'రాజా! ఆ యశోదపట్టి తన చుట్టూ ఉన్నవారిని కూడా గుర్తుపట్టలేని వానివలె చిత్రంగా చూస్తూ, నవ్వుతూ తోడి పిల్లలతో కూడి గంతులు వేస్తాడు. పెద్దలు ఏమైనా చెబితే బుద్ధిమంతుని వలె చేస్తాడు. చాటుమాటున దాక్కుంటాడు. మట్టిలో తిరుగుతూ ఆడుకుంటాడు'. వెయ్యేల? ఆ నల్లవాడు తన పిల్లచేష్టలతో గోకులవాసుల సుఖశాంతులనే గంపను అనుకంప (కరుణ)తో ఇంపుగ నెత్తిన పెట్టుకొని మోస్తున్నాడట! ఇదీ ప్రేమాభక్తి మహిమా శక్తి!

బాలగోపాలుని నందగోకుల లీల ఇక్కడికి ముగిసింది. ఇక బృందావన లీల ప్రారంభమవుతుంది. శుకుడు- మహారాజా! మురిపాల బాలకృష్ణుడు ఐదు సంవత్సరాల వాడయ్యాడు. అతనికి బృందావనం చేరాలని కోరిక కలిగింది. బృహద్వనం (గోకులం)లో బలరామకృష్ణులకు ఉపద్రవాలు కలుగుతున్నందున, బృందావనానికి మకాం మార్చాలని వృద్ధ గోపకుడు ఉపనందుడు దైవ సంకల్పంగా ఇచ్చిన సలహాను నందాదులందరూ అంగీకరించారు. భక్తివనమే బృందావనం! బృందావన మనగా నిజానికి బృహదారణ్యక ఉపనిషత్తే!

**క|| 'చెందిరి బలమాధవులభి**
**నందించుచు బరమ పావనము సంచిత కా**
**ళిందీ సంజీవనమున్**
**బృందావనమున్ మునీంద్ర బృందావనమున్'**


బలరామకృష్ణులు ప్రేమోత్సాహాలతో పరమ పావనమైన బృందావనం ప్రవేశించారు. ఆ బృందావనం కాళిందీ (యమున) నదికే ఉజ్జీవనంగా- జీవం పోసినట్లుగా ఉంది. మునీంద్రుల బృందాలను- సమూహాలను కాపాడేదిగా అలరారుతోంది. బృందావనం చేరి రామకృష్ణులు తమ ఈడు పిల్లలతో కలసి వేడుకగా దూడలను కాయసాగారు. యమున కృష్ణభక్తికి ప్రతీకం- చిహ్నం. ఆ తీరంలో కూడా గోపబాలురకు రెండు బాధలు దాపురించాయి- వత్సాసుర, బకాసురులు. వత్సాసురుడు అజ్ఞానానికి, అంధ విశ్వాసానికి ప్రతీకం. కాగా, బకాసురుడు దంభా(డంబా)నికి సంకేతం. పవిత్రమైన భక్తిలో దంభం వచ్చిచేరితే అది అపవిత్రమవుతుంది. దంభాన్ని మించిన దారుణమైన పాపం మరొకటి లేదు. పరమాత్మ గీతలో అసుర గుణాలను లెక్కిస్తూ మొదటగా 'దంభో దర్పోభిమానశ్చ' అంటూ దంభాన్నే పేర్కొన్నాడు. ఇతర పాపాలకు ప్రాయశ్చిత్తాలు ఉన్నాయికాని దంభానికి, కృతఘ్నతకు నిష్కృతి- ప్రాయశ్చిత్తం లేదు. వేషభాషలు ధార్మికంగా ఉండి లోపల ఈర్ష్యాద్వేషాలు, దుర్భావాలు ఉన్నవాడు బకాసురుడు- బక(కొంగ) రూప అసురుడు.

శుకయోగి- రాజా! ఒకనాడు బలరామకృష్ణులు యమునాతీరంలో దూడలను కాయుచుండగా కంసుని పంపున వచ్చిన, ఆయువు తీరిన ఒక రాక్షసుడు వత్సాసురుడు వారిని వధించడానికి కోడె దూడ రూపంతో దూడల్లో కలిసిపోయాడు. వాణ్ని గుర్తించి బాలగోపాల మణి వాని కాళ్లు, తోక కలిపి పట్టుకొని, పైకెత్తి పెద్ద పెట్టున ఒక వెలగ చెట్టుకేసి కొట్టాడు. వాడు గిలగిల కొట్టుకొని ప్రాణాలు విడిచిపెట్టగా గోపబాలురందరూ ఆనందంతో ఒక్కపెట్టున పెద్దగా కేకలు వేశారు. గొంగళ్లు ఎగరేశారు. ఎగిరి దూకుతూ చప్పట్లు కొడుతూ త్రుళ్ళింతల- మిడిసిపాటులతో పొంగిపోయారు. వేల్పులు- దేవతలు విరుల (పూల) వానలు కురిపించారు. 'వత్సముల మేపుచుండియు వత్సాసురు జంపె భక్తవత్సలు డధిపా!'- భక్తులను కన్నబిడ్డలవలె కాపాడే చిన్నికృష్ణుడు వత్సము(దూడ)లను మేపుతూ కూడా దుర్మార్గుడైన వత్సాసురుని సంహరించాడు.
రాజా! ఒకనాడు గోపబాలురందరూ ఒక కొలనులో దాహం తీర్చుకొని మరలి వస్తుండగా కొండ శిఖరమంత ఒక కొంగను కనుగొన్నారు. అది కృష్ణుని చంపడానికి వచ్చిన బకాసురుడనే దొంగకొంగ.

**ఆ|| 'ఎల్లపనుల మాని యేకాగ్ర చిత్తుడై**
**మౌని వృత్తి నితరమతము విడిచి**
**వనములోన నిలిచి వనజాక్షు పై దృష్టి**
**జేర్చి బకుడు దపసి చెలువు దాల్చె'**

ఆ కొంగ మరో పని ఏదీ చేయకుండా బాలకృష్ణుని మీదే బుద్ధి నిలిపి, ఆ అడవిలోని కొలనిలో మునివలె తడబాటు లేక- నిశ్చలంగా నిలబడి ఉంది. దాని మనసులో మరో ముచ్చటే లేదు. విరోధంతో కృష్ణుని చంప తలచినా దాని మనసుకు నిరోధం (మనోలయం, అమనస్కత) కలిగి, ఆ ప్రయత్నంలో దానికి మహర్షులకు యోగ్యమైన తపస్సు సిద్ధించింది. ఇట్టి నిశ్చలమైన (ధ్యానం హి నిశ్చలా బుద్ధిః) బుద్ధికే ధ్యానమని పేరు. రాజా! ఆ టక్కుల మారి కొక్కెర- కొంగ, ఒక్కపెట్టున నందపట్టి (కృష్ణు)ని ఒడిసిపట్టి ముక్కుతో మింగేసింది. బలరామాదులు భయంతో కంపించి ప్రాణం లేని ఇంద్రియాల వలె నిశ్చేష్టులయ్యారు. అయితే, అన్నీ తెలిసే వన్నెచిన్నెల ఆ దొంగ కన్నయ్య కొంగ చేత మింగుడుపడ్డాడు. నిప్పుముద్దలాగా బకాసురుని కంఠానికి అడ్డుపడి వానికి ముప్పతిప్పలు పెట్టాడు. మింగలేక ఆ కొంగ కృష్ణుని బయటికి వెళ్లగక్కింది. మంగళ స్వరూపుడైన శ్రీహరి కలహానికి కాలుదువ్వే ఆ కొంగ ముక్కు రెండు భాగాలను రెండు బాహువులతో పట్టుకొని గడ్డిపరకను చీల్చినట్లు భీకరంగా అవలీలగా నిలువునా చీల్చివేశాడు. కంస సఖుడైన బకుని, అఖిల జీవ అంతర్యామియైన కృష్ణస్వామి తనలో లీనం చేసుకున్నాడు. దేవతలు పూలవానలు కురిపించారు. ఆకాశంలో దుందుభిధ్వనులు వినిపించాయి. 'బ్రతికి వచ్చావా కృష్ణా' అంటూ గోప కుమారులంతా సంతోషంగా అతనిని కౌగిలించుకున్నారు. భక్తి బాహ్య చిహ్నాలు ధరించి భక్తులుగా లోకులను నమ్మించడానికి తిప్పలు పడేవారు సర్వవిధాల వ్యభిచారులు. వారు ముప్పును కొని తెచ్చుకున్నవారే అవుతారు. 'దంభేన హీనః క్రియతే స ధర్మః'- దంభరహితంగా చేసే దాన, ధ్యాన, పూజా, ధర్మోపదేశాది కర్మలే నిజమైన ధర్మం. అంభోజాక్షుని- విష్ణుని కరుణలేనిదే అంతఃకరణంలో దాగి ఉన్న దంభా(బకా)సురుడు నశించడు! (సశేషం)





తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006